సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజవర్గంలో వేలాది కుటుంబాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల లబ్ధిపొందారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రభుత్వ సహాయం అందిందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ తదితరులున్నారు.

'రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం'



గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని కేంద్ర మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పీఎస్ బఘేల్ అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఎంపీ ఈటల రాజేందర్‌తో శనివారం కేంద్ర మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

అభినందనలు



రవీందర్‌రావును అభినందిస్తున్న బండారు దత్తాత్రేయ

జియాగూడ: సమాజానికి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్‌కు సేవలందించిన అధ్యక్షుడు లయన్ ఆకుల రవీందర్‌రావు అభినందనీయులని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ధూల్‌పేటకు చెందిన లయన్ ఆకుల రవీందర్‌రావు 25 ఏళ్లు పూర్తి చేసిన సందర్భంగా ఆయనకు పూల తొట్టి ఇచ్చి అభినందించారు. అనంతరం రవీందర్‌రావు మాట్లాడుతూ..లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లు, అవగాహన ర్యాలీలు, గణేష్ నవరాత్రి నిమజ్జనం రోజున ఉచితంగా అంబులెన్సు సర్వీస్, ఐ బ్యాంక్, వికలాంగులకు పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

స్వచ్ఛతపై బస్తీవాసులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్, భీశ్వ సురేఖ

అబిడ్స్: పూల్‌బాగ్‌లో జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రోగ్రామ్ నిర్వహించారు. బస్తీవాసులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ ఉమాప్రకాష్ మాట్లాడుతూ..పూల్‌బాగ్ బస్తీవాసులకు రూ.25లకే చెత్త సేకరణ చేపడుతామన్నారు. బస్తీలోకి ప్రతిరోజూ తమ సిబ్బంది పరిశుభ్రత చేపట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీశ్వ సురేఖ, భీశ్వ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మంజుల

జియాగూడ: మానసిక స్థితి సరిగా లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..డోర్‌బస్తీ విటల్ రుక్మిణి ప్రాంతానికి చెందిన మంజుల (50)కు 17 ఏళ్ల క్రితం విశాల్‌రావుతో వివాహం అయ్యింది. మానసిక స్థితి సరిగా లేని మంజులను వదిలేసి వెళ్లిపోయాడు. గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకి వెళ్లిన మంజుల తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంజుల సోదరుడు దినేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మరమ్మతులెన్నడో..?

పాతబస్తీలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు

ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరదలు రావడంతో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. అక్కడక్కడ ప్రధాన రోడ్లు సైతం కొట్టుకుపోయి అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో వర్షం కారణంగా ఏర్పడిన పాట్ హోల్స్‌కు వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కాలయాపన చేస్తే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, భారీ వాహనాలకు సైతం నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని పాతబస్తీ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చార్మినార్: పాతబస్తీలోని రోడ్లు భారీ వర్షాలకు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అంతర్గత రోడ్లతో పాటు ప్రధాన రోడ్లు సైతం గోతులమయంగా మారాయి. వర్షా కాలంలో వరదనీటి ప్రవాహానికి రోడ్లు కొట్టుకుపోయి గుంతలమయంగా మారుతాయని చెప్పే జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, ప్రస్తుతం ఎలాంటి వర్షాలు లేకున్నా రోడ్లన్నీ గోతులమయంగా ఎందుకు మారుతున్నాయో చెప్పాలని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని రోడ్లు వాహనదారుల రాకపోకలకు ఏ మాత్రం అనుకూలంగా లేకున్నా.. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోందంటున్నారు. అక్కడక్కడ బాగున్న రోడ్లను అభివృద్ధి పనుల పేరుతో ఎక్కడికక్కడ తవ్వేస్తున్నారు. పనుల అనంతరం తిరిగి పూడ్చడం లేదు. తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు పనులు చేసి చేతులు దులుపుకుంటున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పురానీహవేలీలో గుంతలమయంగా ప్రధాన రోడ్డు

కార్యాలయాలకే పరిమితం..

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు అవసరమైన మేరకు ఉన్నప్పటికీ వారు తమ తమ కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఎక్కడ రోడ్లు బాగున్నాయో..ఎక్కడ శిథిలావస్థకు చేరుకున్నాయో..? అనే సమాచారాన్ని సైతం తమ వద్ద పొందుపరచడం లేదు. రోడ్ల మరమ్మతుల విషయంపై ఎక్కడినుంచైనా ఫిర్యాదులు అందితే...చూస్తాం..వేయిస్తాం.. రిపోర్టులు పంపించాం..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని పాతబస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత లేదు..

అధికారులతో పాటు సిబ్బంది కొరత లేదు. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో సర్కిల్ ఉంది. ఒక్కో సర్కిల్‌కు డిపూటీ కమిషనర్‌తో పాటు ఇంజినీరింగ్ విభాగం కూడా ఉంది. ఆయా సర్కిల్స్ ఇంజినీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి నుంచి డీఈఈలు, ఏఈఈలతో పాటు క్షేత్ర స్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు విధినిర్వహణ కొనసాగిస్తుంటారు. ఇంత మంది అధికారులు పని చేస్తున్నా పాతబస్తీ రోడ్లు మాత్రం బాగుపడడం లేదు.

నిధుల దుర్వినియోగం జరగకుండా చూడాలి..



పాతబస్తీలో సరైన రోడ్ల మరమ్మతు పనులు జరగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఎక్కడైనా రోడ్లు వేస్తే..ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. నిధుల దుర్వినియోగం జరగకుండా చూడాలి.

– ఉమామహేంద్ర, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు

కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం..



జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని ప్రధాన రోడ్ల మరమ్మతులు ఇతర పనులను తమ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కొత్తగా వేసే రోడ్లతో పాటు మరమ్మతులను సైతం నిర్వహించడానికి ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాం. ఎక్కడైనా రోడ్లు శిథిలావస్థకు చేరుకుంటే..మా దృష్టికి తీసుకు వస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల భారీ వర్షాలకు రోడ్లన్నీ కొట్టుకుపోయిన విషయం వాస్తవమే. అయితే వీటికి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయాలంటే వర్షాలు పూర్తిగా తగ్గితేనే సాధ్యమవుతుంది.

– సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, చార్మినార్ జోనల్ కమిషనర్

స్టాన్లీ కళాశాల, బిట్స్ పిలానీ మధ్య అవగాహన ఒప్పందం



స్టాన్లీ కళాశాలలో బిట్స్ పిలానీ ప్రొఫెసర్ల బృందం, కళాశాల చైర్మన్ కృష్ణారావు

అబిడ్స్: స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. స్టాన్లీ కళాశాలకు బిట్స్ పిలాని ప్రొఫెసర్ల బృందం వచ్చి పలు విభాగాల్లో స్టాన్లీ కళాశాల యాజమాన్యంతో ఒప్పందాన్ని అంగీకరించుకున్నారు. ఈ సందర్భంగా స్టాన్లీ కళాశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ కె.కృష్ణారావు మాట్లాడుతూ..జాతీయ, అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా నాణ్యమైన సాంకేతిక విద్యను తమ కళాశాలలో బోధిస్తున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ విద్యలో పలు విభాగాల్లో బిట్స్ పిలానితో అవగాహన ఒప్పందం కుదరడం తమ కళాశాలకు రెట్టింపు ఉత్సాహం వస్తుందన్నారు. వేలాది మంది విద్యార్థినులు విదేశాలలో సైతం మంచి ఉద్యోగాలు పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బీఎల్.రాజు, పలు విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ శివానియాదవ్, డాక్టర్ అలివేలు మంగ, ప్రొఫెసర్ చేతన్‌కుమార్, ప్రొఫెసర్ అభిజిత్ దాస్, డాక్టర్ షేక్ అజీజ్‌అలీ, ప్రొఫెసర్ రవికిశోర్, డాక్టర్ విజయేందర్ సోలంకి, మేనేజ్‌మెంట్ సభ్యులు రాకేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, డీన్ అకాడమిక్స్ ప్రొఫెసర్ వినయ్‌బాబు, డైరెక్టర్ డాక్టర్ వి.అనురాధ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమేష్ పాల్గొన్నారు.

జస్టిస్ రాధారాణికి ఆంధ్రకేసరి స్మారక పురస్కారం



జస్టిస్ రాధారాణి దంపతులను సన్మానిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

సుల్తాన్‌బజార్: శ్రీ కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతి సంయుక్తాధ్వర్యంలో నెల నెలా సాహిత్య పరిమళాలు పేరిట నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు బాషా నిలయంలో పూర్వ హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణికి ఆంధ్రకేసరి స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి సాహిత్య రూపకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ హైకోర్టు జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై జస్టిస్ రాధారాణికి ఆంధ్రకేసరి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్, నంది అవార్డు గ్రహీత ఎన్.గోపాలకృష్ణ, ఆచార్య రంగాచార్య, కళారత్న డాక్టర్ కేవీ కృష్ణకుమారి పాల్గొన్నారు. అంతకు ముందు ఆంధ్రకేసరి సాహిత్య రూపకాన్ని కళాకారులు ఎంతో రసభరితంగా ప్రదర్శించారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్



జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్

గన్‌ఫౌండ్రీ: ఉద్యోగుల సంక్షేమానికి, ప్రగతికి టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అండగా ఉంటుందని ఆ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షుడు ఎం.జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ పరిధిలో 21 మంది సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇప్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్, భాస్కర్ ఆధ్వర్యంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనిను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ.... ఎంతో మంది సిబ్బందికి ఎడ్యుకేషన్ ఫోరం పదోన్నతులు కల్పిస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. జిల్లా డీఈఓ రోహిణి, ఏడీ శ్రీనివాస్ రెడ్డి, రాజ్‌కుమార్, భాస్కర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముక్తదార్, జయంత్‌రెడ్డి, రమేష్, సుదర్శన్, శేఖర్, శివ, అరుణజ్యోతి, లక్ష్మీపతి, పరమేష్, సూర్య పాల్గొన్నారు.

ఉత్సవాలను సమష్టిగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా

చార్మినార్: ఉత్సవాలను సమష్టిగా నిర్వహించుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. ఈసారి వినాయక ఉత్సవాలతో పాటు మిలాద్-ఉన్-నబి వేడుకలు ఒకటి రెండు రోజుల తేడాతో వస్తున్నాయని..ఈ రెండింటిని ప్రశాంతంగా నిర్వాహించుకోవాలని ఆమె కోరారు. ఈ వేడుకలను పురస్కరించుకుని సెంట్రల్ పీస్ కమిటీ అండ్ వెల్ఫేర్ కమిటీ (సౌత్ జోన్) ఆధ్వర్యంలో పాతబస్తీ ఎతేబార్ చౌక్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన శాంతి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతై..పాతబస్తీలో ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం డీసీపీ ఎం.ఏ.మాజీద్, ఏసీపీలు చంద్రశేఖర్ (చార్మినార్), ఎం.ఏ.జావీద్ (ఫలక్‌నుమా), చంద్రశేఖర్ (ఛత్రినాక), శ్యాంసుందర్ (మీర్‌చౌక్), శాంతి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఈఈ రవీందర్, ఏఈ మహేష్ తదితరులు

చార్మినార్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పిల్లిగుడిసెలు 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ అన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 పరిధిలోని పిల్లిగుడిసెలు 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో కొంత కాలంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ హౌసింగ్ విభాగం డివిజన్-1 ఈఈ రవీందర్, ఏఈ మహేష్ తదితరులు పరిశీలించారు. మూసీ తీర ప్రాంతంలో నివసిస్తున్న శంకర్‌నగర్ బస్తీ వరద బాధితులను గతంలో పిల్లిగుడిసెలు డబుల్ బెడ్ రూం భవనాల్లోకి తరలించి తగిన సౌకర్యాలు కల్పించడానికి పలు అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మలక్‌పేట్ ఎమ్మెల్యే బలాలా ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రంతో పాటు బస్తీ దవాఖానాను నిర్మిస్తున్నారు. ఈ పనులను ఈఈ, ఏఈలు స్వయంగా పరిశీలించారు. విషయం తెలుసుకున్న అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం వారిని కలిసి అభివృద్ధి పనులు సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో కొదిసేపు అధికారులకు కమిటీ ప్రతినిధులమైన తమకు వాగ్వాదం జరిగిందన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుతామని వారు హామీ ఇవ్వడంతో కమిటీ ప్రతినిధులు శాంతించారన్నారు.

ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శం



గన్‌ఫౌండ్రీ: ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని శనివారం ప్రకాశం అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ..ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రకాశం పంతులు మనవడు టంగుటూరి శ్రీరామ్ మాట్లాడుతూ..ప్రకాశం పంతులు విగ్రహం చోటు ఉన్న అపరిశుభ్రత వాతావరణాన్ని తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి, నిరంజన్ సాయి, మురళి, శ్రీనివాస్, హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. శనివారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి యాకుత్‌పురా చాంద్ సాహెబ్ లైన్ ప్రాంతంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో పర్యటిస్తూ స్థానికంగా నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, నాలా విస్తరణ పనులను చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ అలందార్ వాలాజాహి, జీహెచ్‌ఎంసీ ఈఈ దేవేందర్, అధికారులు పాల్గొన్నారు.

మంగళ్‌హాట్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



అబిడ్స్: మంగళ్‌హాట్ పరిధిలోని ధూల్‌పేట ప్రధాన రోడ్డులో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులు మాన్సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అబిడ్స్ జీహెచ్‌ఎంసీ-14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ధూల్‌పేట పురానాపూల్ చౌరస్తా నుంచి మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ మీదుగా బోయిగూడ కమాన్ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ..సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యాపారస్థులు ముఖ్యంగా తమ దుకాణాలలోని చెత్తాచెదారాన్ని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య ఆటోలలోనే వేయాలన్నారు.

మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులకు అధునాతన బైక్



యాకుత్‌పురా: ట్రాఫిక్ పోలీసుల పనితీరును మరింత మెరుగు పరిచేందుకు ప్రభుత్వం అధునాతన బైక్‌ను మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలుసులకు అందజేశారు. నగర వ్యాప్తంగా ప్రవేశపెట్టిన ద్విచక్ర వాహనాలను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ అందజేశారు. శనివారం మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ నూతన వాహనాని నడిపి దాని ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ వాహనాన్ని అడ్వాన్స్ పీఏ సిస్టం, కలర్ మైక్, యూహెచ్‌ఎఫ్ హ్యాండ్ హోల్డ్, మైక్రొఫోన్, ఎస్ఈడీ బటన్, మోటార్ సైకిల్ డ్యాష్ బోర్డు కెమెరా, జీపీఎస్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, వీల్ క్లంప్ కరీయర్, రిఫ్లెక్ట్ జాకెట్, రెయిన్ కోర్టు, షూస్, ట్యాబ్, బాడీ కెమెరాలతో ప్రత్యేకంగా రుపొందించారని తెలిపారు.

వీధి దీపాలను ఏర్పాటు చేయాలి

శాలిబండ: శాలిబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బస్తీలు, లోపలి వీధుల్లో చీకటితో కుమ్ముకుపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదారులు, పాదచారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే వీధి దీపాలకు మరమ్మతులతో పాటు లేని చోట్ల కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రమణీయం.. కథక్ నృత్య రూపకం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాట్యరంగ సంస్థ నాద్ నీడ్ డ్యాన్స్ స్టూడియో దశాబ్ది వేడుకలను శనివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన 75 మంది నర్తకీమణులు ఏక కాలంలో చేసిన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..కళలు, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. సంస్థ గురువు అర్చన మిశ్రా శిష్యబృందం చేసిన నాట్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథక్ నాట్య గురువు సంజయ్‌కుమార్, కళాశ్రీ పి.రమాదేవి, గిట్‌లైఫ్ గ్లోబల్ సంస్థ వ్యవస్థాపకులు సమ్రాట్ కృష్ణదాస్, కథక్ గురువు డాక్టర్ నీలిమా దేశ్‌పాండే, ఎన్‌టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణన్, సంస్థ వ్యవస్థాపకురాలు అర్చన పాల్గొన్నారు.

అన్నదానాలు..అమావాస్య పూజలు



అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ ప్రతినిధి వంశీ కృష్ణ



గోల్కొండ కోట మహంకాళి ఆలయంలో పూజల్లో ఈఓ వసంత



కాలభైరవ ఆలయంలో..

గోల్కొండ: గోల్కొండ కోటలో అమ్మవారికి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ బోనాలు విజయవంతం చేశామన్నారు. మహంకాళి ఆలయ పూజారి సురేష్‌చారి, సర్వేష్ తదితరులున్నారు.

సంజయ్‌నగర్‌లో..

జియాగూడ: సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయంలో శనివారం అమావస్య పూజలు ఘనంగా నిర్వహించి మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రావు, ఎం.సురేష్, బాబు పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా, గౌలిపురా, వాసవీ అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ బావి వద్ద ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శ్రీరాం కోటయ్యగుప్తా, శ్రీధర మల్లికార్జున్ గుప్తా, శ్రీనివాస్ గుప్తా, వెంకటేశంగుప్తా, బిక్షపతిగుప్తా, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద..

బజార్‌ఘాట్‌లో..

నాంపల్లి: శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకుని బజార్‌ఘాట్‌లోని కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణ మాసంలో ఆచరించే వ్రతాల్లో పోలాల అమావాస్య వ్రతానికి అత్యధిక ప్రాధాన్యత ఉండటంతో ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కాలభైరవుడిని దర్శించుకునేందుకు కిలో మీటరు మేర భక్తులు క్యూ కట్టారు.

బీజేపీ గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మృతి

జియాగూడ: బీజేపీ గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌కుమార్ డెగాన్ ఆకస్మికంగా మృతి చెందడంపై జియాగూడలో విషాద ఛాయలు నెలకొన్నాయి. 40 ఏళ్లుగా బీజేపీలో ఉంటూ గోల్కొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా, 24 నియోజకవర్గాల ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా, నగర మోర్చా ఉపాధ్యక్షుడిగా జియాగూడ డివిజన్ అధ్యక్షుడిగా, ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్, అఖిల భారత వాల్మీకి సమాజ్ ప్రధాన కార్యదర్శిగా సేవలందించాడు. సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సి.అశోక్‌కుమార్, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, దేవర శ్రీను, కె.నర్సింగ్‌రావులు నివాళులర్పించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273